మామిడికి పచ్చ పురుగు దెబ్బ

విపరీతంగా కురుస్తున్న మంచు, పచ్చ పురుగు దెబ్బకు మామిడి తోటలకు నష్టం కలుగుతోందని నియోజకవర్గంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. వచ్చిన కాస్త పూతను పచ్చ పురుగు తినేస్తుండడంతో దిక్కు తోచడం లేదు. గత ఏడాది తక్కువ దిగుబడి దెబ్బ నుంచి కోలుకుందామని ఆశిస్తున్న రైతులను పచ్చపురుగు, మంచు దెబ్బతీస్తున్నాయి. పచ్చపురుగు నిర్మూలనకు ఏ చర్యలు తీసుకోవాలో తెలియక రైతులు సతమతమవుతున్నారు.


శ్రీకావేరిరాజుపురంలో మామిడి తోటను కమ్మేసిన పొగ మంచు

- పూతను తినేస్తున్న పురుగు
- మరోవైపు మంచు ప్రతికూల ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు

పాలసముద్రం : గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఆముదాల, బాలక్రిష్టాపురం, వనదుర్గాపురం, గంగమాంబపురం, కేజేపురం, వెంగళరాజుపురం, తిరుమలరాజుపురం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీల్లో మామిడి తోటల విస్తీర్ణం ఎక్కువగా ఉంది. మామిడి తోటల్లో డిసెంబర్ నుంచి పూత విరబూసింది. పిందెలు కాసే సమయంలో పచ్చ పురుగు ఆశించడం వల్ల వచ్చిన పూత వచ్చినట్టే పోతోంది.

మంచుతో మామిడి పంటల దెబ్బ

మంచు అధికంగా పడుతుండడం వల్ల మామిడి పూత పింద కాకుండా మాడిపోతుంది. మంచు పడే సమయంలో, రాత్రి వేళల్లోను, ఉదయం సూర్యోదయం అయ్యేలోపు మామిడి పూతను నాశనం చేసే పురుగుల ఎద్దడి ఎక్కువగా ఉంటోందని రైతులు చెప్పారు.

పట్టించుకోని అధికారులు

మామిడి పూతలకు మంచుతో పాటు తెగులు ఆశిస్తున్నా దీనిపై ఉద్యానవన శాఖాధికారులు దృష్టి సారించడం లేదు. వీటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల గురించి తమకు చెప్పిన పాపాన పోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పురుగులు, తెగుళ్ల నిర్మూలనకు రైతుల మామిడి తోటలు తీసుకుంటున్న వ్యాపారస్తుల సలహాలు–సూచనలు పాటించి మందులు పిచికారీ చేస్తున్నారు. వాటి వల్ల ఏమాత్రం ఫలితం ఉంటుందో పైవాడికే ఎరుక. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తోటలను పరిశీలించి సస్య రక్షణ గురించి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పూత తినేస్తుంది

మామిడి చెట్లు పూత దశకు వచ్చే సమయంలో ఈ ఏడాది పొగ మంచు, పచ్చ పురుగు కబళించింది. పచ్చ రంగులో ఉండే ఈ పురుగులు పూతను తినేస్తున్నాయి. విపరీతమైన మంచు ప్రభావంతో పూత మాడిపోతోంది. పూతను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. తెలిసిన మందులు పిచికారీ చేస్తున్నారు. మరోవైపు మామిడి తోటలకు ఆకు ముడత తెగులు సైతం ఆశించడంతో రైతుల పరిస్థితి మూలిగే నక్క మీద తాటిపండు పడిన చందాన ఉంటోంది.


పచ్చ పురుగు, ఆకు ముడత తెగులు నిర్మూలనకు మందులు పిచికారీ చేస్తున్న రైతు

రూ.20 వేలు పైగా ఖర్చు చేశా



నాకు మూడు ఎకరాల మామిడి తోట ఉంది. ఇప్పటివరకు మామిడి పూత సరిగా రాలేదు. పూత అంతంత మాత్రంగా ఉండడంతో మూడు సార్లు మందులు పిచికారీ చేశా. దీనికోసం రూ 20 వేలు పైగా ఖర్చైంది. ఇప్పటికే క్లోరిఫైరిపాస్, సాఫ్ పొడి మందు, మామిడి చెట్లకు కొట్టించా. పోయిన సంవత్సరం అనుకున్నంత దిగుబడి రాలేదు. ఈ సారైనా బాగా ఉంటుందనుకుంటే మామిడి పూత రాలేదు.

– మైథిలి, సింహరాజపురం

ఈ పాటికే పూత రావాల్సింది



మామూలుగా అయితే ఈ టయానికల్లా మామిడి చెట్లకు పూత బాగా వచ్చేది. తేమ శాతం ఎక్కువ కావడమా లేక వాతావరణ ప్రభావమో తెలియదుగానీ ఇంతవరకు పూతే కనిపించలేదు. పోయిన సంవత్సరం కూడా ఆశించినస్థాయిలో పూత, దిగుబడి లేక చాలా నష్టపోయాం.ఈసారీ అదే పరిస్థితి మాకు నష్టం తెచ్చేలా ఉంది.

– వడివేలురెడ్డి, సీఎం కండ్రిగ

వాతావరణం ఎఫెక్ట్



ఇటీవల వరుస తుపాన్లు వచ్చిన కారణంగా వాతావరణం మారింది. మండలంలో ఉద్యానవనశాఖ అధికారి లేకపోవడడంతో ఇబ్బంది పడుతున్నాం. మామిడి రైతులకు పూత రావడానికి అవగాహన లేదు. రైతులు పూత రాలేదని ఎక్కువ మొత్తంలో ఎరువులు, మందులు వినియోగం ఖర్చులు పెరిగిపోవడమేకాకా నష్టపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

– గణేష్‌రెడ్డి, వినాయకపురం, మాజీ సర్పంచ్

క్లుప్తంగా

గోవింద భక్తుల అన్నదానం


అన్నదానం చేస్తున్న గోవింద భక్తులు

నగరి: పట్టణంలోని గోవింద భక్తులు పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక కరియమాణిక్యస్వామి ఆలయం వద్ద అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ ముడుపు ధరించి పాదయాత్ర ప్రారంభించే రోజుకు మునుపటి రోజున అన్నదానం చేయడం దశాబ్ద కాలం పైగా కొనసాగుతోందన్నారు. అన్నదాన కార్యక్రమంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

పంటల పరిశీలన


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ తులసీరాం

నింద్ర: వరి, వేరుశనగ పంటల్లో చీడపీడల నివారణకు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. బుధవారం మండలంలోని మిట్టూరులో వేరుశనగ, వరి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వేరుశనగను పచ్చపురుగు, లద్దె పురుగులు ఆశించాయని, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాపిరెడ్డిపల్లె సచివాలయం మార్పుపై నివేదిక


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

గంగాధర నెల్లూరు: పాపిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం మార్పుపై గ్రామ సభలో అందిన ప్రజల వినతులు, ప్రతిపాదనలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి చెప్పారు. బుధవారం పాపిరెడ్డిపల్లె పంచాయతీ పెద్ద కొండేపల్లె వద్ద ఉన్న రైతు సేవా కేంద్రాన్ని ప్రజలకు అనుగుణంగా మార్చడానికి, గ్రామస్తులు నిర్మించిన కమ్యూనిటీ భవనం వద్దకు మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామసభలో సర్పంచ్ పార్థసారధి రెడ్డి, పాపిరెడ్డిపల్లె ఎంపీటీసీ భారతి, నందనూరు పంచాయతీ సర్పంచ్ మంజుల, గ్రామస్తులు పాల్గొన్నారు.

టీబీ అలర్ట్ హెల్త్ క్యాంప్


మాట్లాడుతున్న వైద్యాధికారి

నగరి: మండలంలో బుగ్గ అగ్రహారం పీహెచ్‌సీ పరిధిలోని రామాపురంలో బ్రీత్ సేఫ్ 360 టీబీ అలర్ట్ ఇండియా సహకారంతో బుధవారం టీబీ అలర్ట్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 50 మందికి టీబీ, బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు ఇతర ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. తరచూ దగ్గు, జ్వరం రావటం, బరువు దగ్గడం, గళ్లలో రక్తం పడటం.. లాంటి లక్షణాలు ఉన్నపక్షంలో తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి రమేష్ తెలియజేశారు. 8 టీబీ స్ఫుటం శాంపిల్ సేకరించారు. శిబిరంలో డాక్టర్ కీర్తి, భానుప్రసాద్, సర్పంచ్ ప్రవీణ్, పంచాయతీ సెక్రటరీ బాబు, ఎంపీహెచ్ఎస్ శ్రీనివాస్, టీబీ అలర్ట్, పవన్, టీబీ హెచ్‌వీ ప్రేమ, సీహెచ్ఓలు యామిని, పునిదవల్లి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపక బృందం

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో 65 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ తెలిపారు. గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన 85 మంది విద్యార్థుల్లో ప్రతిభ, విద్యార్హతల ఆధారంగా 65 మందిని ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీ హెచ్ఆర్ ఆఫర్ లెటర్లను అందజేశారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శాఖాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రామయ్య కుటుంబ సభ్యులు

గంగాధర నెల్లూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు పూర్వ విద్యార్థి రామయ్య రూ.20 వేల విలువగల స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందించాలన్న ఉద్దేశంతో తన కుటుంబ సభ్యులతో ఈ వితరణ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని హేమలత, దినకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు రైతులు కరువు


రైతులు లేక ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న రెవెన్యూ గ్రామ సభ

పాలసముద్రం: మండలంలోని నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలు బుధవారం ముగిశాయి. పాలసముద్రం గ్రామ సచివాలయ పరిధిలో నిర్వహించినగ్రామ సభకు రైతులు కరువయ్యారు. మరోవైపు గ్రామసభలో అధికారుల దృష్టికి నివేదించిన సమస్యల్ని ఎప్పుడు పరిష్కరిస్తారని నిలదీశారు. జెడ్పీటీసీ అస్ఫలగన్ మాట్లాడుతూ, పాలసముద్రం దళితవాడ గ్రామస్తులు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని తహసీల్దార్ అరుణకుమారికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇకనైనా నిత్యావసర సరుకులు గ్రామంలోనే పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజ్, ఏఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేషన్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదపై ఫిర్యాదు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పరిసర ప్రాంతాల్లో పిచ్చి కుక్కల బెడద రోజురోజుకూ అధికమవుతోందని స్థానికులు బుధవారం ఈఓపీఆర్డీ పురుషోత్తంకు ఫిర్యాదు చేశారు. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయని, అలాగే నివాసాల వద్ద పిల్లలపై దాడులు చేస్తున్నాయని తెలియజేశారు. అలాగే బొమ్మన్‌దొడ్ల గ్రామంలో కోతుల బెడద పీడిస్తోందని, అటు వీధి కుక్కలు, ఇటు కోతల బెడద లేకుండా చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఈఓపీఆర్డీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శి గంగాభవానిని ఆదేశించారు.

ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుడు



ఆలయానికి చేరిన విగ్రహాలు, నిర్మాణం పూర్తికావొస్తున్న ప్రసన్న వేంకటేశ్వర ఆలయం

- ఆలయానికి చేరిన విగ్రహాలు
- శరవేగంగా ఆలయ నిర్మాణం
- 2023 ఆగస్టులో భూమిపూజ చేసిన అప్పటి మంత్రి ఆర్కే రోజా

నింద్ర : నింద్రలో చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ప్రసన్న వేకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం దాదాపు పూర్తి కావస్తోంది. అలాగే ఆలయంలో ప్రతిష్ఠించనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి, గరుత్మంతుల విగ్రహాలు ఆలయానికి చేరుకున్నాయి. వాటికి ఆగమోక్తంగా పూజలు చేశారు. దశాబ్దాల తరబడి శిథిలావస్థలో ఉన్న ఆలయం ఇప్పుడు కళకళలాడుతోంది. గతంలో ఆలయంలో పురావస్తు శాఖ నిర్వహించిన తవ్వకాల్లో 5 పంచలోహ విగ్రహాలు బయటపడగా వాటిని అధికారులు ట్రెజరీకి తరలించారు, ఒక పెద్ద రాతి విగ్రహాన్ని చెన్నై మ్యూజియానికి తరలించారు. ఇంతటి విశిష్టతను కలిగి ఆలయంలో విగ్రహాలు లేక పిచ్చిమొక్కలు, చెత్త కుప్పల చాటున కనిపించిన ఈ ఆలయంలో ఇప్పుడు శ్రీదేవి, భూదేవి సమేతంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి ప్రసన్నమయ్యారు. త్వరలో ఆలయం కుంభాభిషేకానికి సిద్ధమవుతోంది. ఈ ఘనత మాజీ మంత్రి ఆర్కేరోజాకే దక్కుతుంది. ఎవరూ పట్టించుకోని ఈ ఆలయాన్ని ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహించారు. శిథిలమైన ఆలయాన్ని తొలగించి నూతన ఆలయ నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.1.70 కోట్లు మంజూరు చేయించారు. 2023 ఆగస్టులో ఈ ఆలయ నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ప్రస్తుతం పనులు తుదిదశకు చేరుకోవడంతో ఆలయం సరికొత్త కళతో భక్తులను ఆకట్టుకుంటోంది.


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అప్పటి మంత్రి ఆర్కేరోజా (ఫైల్)

కాజ్‌వే పనులు ఎప్పుడు సారూ..?



వడమాలపేట వంక కాజ్‌వేను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్), ఎస్‌వీపురం బ్రిడ్జి కింద గుంతలమయమైన రోడ్డు

వడమాలపేట (విజయపురం): గత ఏడాది డిసెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట వద్ద చీమలవారి వంక కాజ్‌వే 20 అడుగుల వరకు కుంగింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఆ మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కాజ్‌వే దెబ్బతిని నెల రోజులైనా ఇంతవరకు మరమ్మతుల జోలికి వెళ్లకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వడమాలపేట మీదుగా వచ్చే బస్సులు, వాహనాలన్నీ బైపాస్ మీదుగా వెళ్తుండడంతో వడమాలపేట, పరిసర గ్రామాల ప్రజలు రాకపోకలకు అగచాట్లు పడుతున్నారు. వడలమాలపేట మండల కేంద్రం నుంచి నిత్యం ఉద్యోగులు, అలాగే ఉపాధి కోసం వందలాది మంది తిరుపతి, పుత్తూరుకు వెళుతుంటారు. ప్రధానంగా తిరుపతి–చెన్నై వెళ్లే బస్సులు వడమాలపేటకు రాకపోవడంతో ప్రయాణికులు పడుతున్న ఇక్కట్లు వర్ణనాతీతం. బస్సుల కోసం ఐదు కిలోమీటర్లు నడిచో లేదా ఆటోలలో వెళ్లవలసిన దుస్థితి కలిగింది. గత ఏడాది డిసెంబర్ 16న జిల్లా కలెక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు చీమలవారి వంక కాజ్‌వే పరిశీలించారు. మరమ్మతులు చేస్తామని ప్రకటించినా ఇంతవరకూ ఆ జాడే లేదు. అలాగే ఎస్‌వీపురం రైల్వే బ్రిడ్జి కింద ఊట నీరు రోడ్డుపైకి రావడంతో వాహనాల ధాటికి రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆటో, ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి కింద ఊట నీరు నిల్వ ఉండడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి పడి గాయాల పాలవుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి వడమాలపేట వంక కాజ్‌వే, ఎస్‌వీపురం రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటో బోల్తా: ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

ఆరుగురికి స్వల్ప గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెట్రి, కనిష్క

నగరి : మున్సిపల్ పరిధిలోని ఏకాంబరకుప్పం వెళ్లే మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న మలుపు వద్ద ప్రైవేటు ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటో బుధవారం సాయంత్రం బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏకాంబరకుప్పం ప్రాంతానికి చెందిన వెట్రి (9), కనిష్క (9) అనే ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయలు కాగా మరో ఆరుగురు చిన్నారులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుగున వెళ్లిన స్థానికులు బోల్తా పడిన ఆటో నుంచి విద్యార్థులను బయటకు తీశారు. అప్పటికే విషయం తెలుసుకుని భయాందోళనతో సంఘటనా స్థలానికి హుటాహుటిన వచ్చిన పిల్లల తల్లిదండ్రులు స్వల్పగాయాలైన వారిని వెంటనే ఇళ్లకు తీసుకెళ్లారు. తీవ్రగాయాలైన వెట్రి, కనిష్కను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లడిల్లుతున్న చిన్నారులను చూసి తల్లిదండ్రులు బోరున విలపించడం ఆస్పత్రిలో ఉన్నవారిని సైతం కలచివేసింది. ప్రాథమిక చికిత్స అనంతరం వెట్రిని తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించారు. 8 మంది విద్యార్థులు ప్రతిరోజు ఈ ఆటోలు వెళుతుంటారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపుతున్నారు. మలుపు వద్ద రోడ్డు సరిగాలేక అదుపు తప్పడమే ప్రమాదానికి కారణమని సీఐ మహేశ్వర్ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ స్వరూప

కార్వేటినగరం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆర్కే ఎస్సార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ స్వరూప అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను సెల్‌ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉంచాలన్నారు. అలాగే తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, దురలవాట్లకు దూరంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అధ్యాపకుడు డాక్టర్ కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యలో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యాబోధన చేస్తున్నామని, దీనితో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజేష్, కుమార్, కృష్ణకిశోర్, మాధవనాయుడు, లక్ష్మి, రాజేష్, సురేష్, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి

గంగాధర నెల్లూరు : మండలంలో ఈ ఏడాది విస్తృతంగా కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆదేశాల మేరకు జనవరి నుంచి జూన్ వరకు ఉపాధిలో చేయాల్సిన పనులపై ఎంపీడీఓ సమీక్షించి మాట్లాడారు. ఉపాధిలో వ్యవసాయ అనుబంధ పనులు నీటి కుంటలు, సరిహద్దు కందకాలు, రింగ్ ట్రెంచ్‌లు, అమృత్ సరోవర్ పనులు అధికంగా చేయాలని, కూలీలకు రూ. 300 తక్కువ కాకుండా దినసరి కూలీ వచ్చేలా పని చేయించాలని ఏపీఓ శ్రీనివాసులు కోరారు. కార్యక్రమంలో పాలసముద్రం, జీడీ నెల్లూరు మండలాల ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలో ఉపాధి హామీ కింద చేయనున్న పనులపై బుధవారం వెదురుకుప్పంలో శిక్షణ ఇచ్చారు. 25 గ్రామ పంచాయతీలకు సంబంధించి క్షేత్ర సహాయకులకు పనులను ఏ విధంగా చేయాలి, పనుల్లో ఏ విధంగా కొలతల పరిమాణం తీసుకోవాలి? మస్టర్లు ఎలా వేయాలి? బిల్లుల చెల్లింపులు, కూలీలకు గిట్టుబాటు అయ్యే వివరాలు, చెరువు పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ ఇందు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లను ఢీకొన్న ప్రైవేటు స్కూల్ వ్యాన్


పెనుమూరు బీసీకాలనీ వద్ద ద్విచక్ర వాహనాలను ఢీకొన్న ప్రైవేటు స్కూల్ వ్యాన్

పెనుమూరు(కార్వేటినగరం): రెండు ద్విచక్రవాహనాలను ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి పెనుమూరు బీసీ కాలనీ వద్దచోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం..తిరుపతిలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాన్ చిత్తూరు పరిసర ప్రాంతాల్లో కేన్వాసింగ్ పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో పెనుమూరు బీసీకాలనీ వద్ద ఎదురుగా వస్తున్న రెండు బైక్‌లను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సోమనందాపురానికి చెందిన శీను పెనుమూరు నుంచి బైక్‌లో ఇంటికి వెళుతున్న సమయంలో అతడిని వ్యాన్ ఢీకొంది. ఆయన్ను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని వెనుక మరో ద్విచక్రవాహనంలో వస్తున్న చార్వాగానిపల్లెకు చెందిన విష్ణు(33)ను కూడా వ్యాన్ ఢీకొనడంతో అతనికి ఎడమ కాలు విరిగి, తలకు తీవ్రగాయాలవడంతో అతడిని తిరుపతికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేయాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

నగరి: పట్టణంలోని పేదలు, కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించి వర్కర్స్ కాలనీ ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం పట్టణ పార్టీ కార్యదర్శి వేలన్, మురళి అధ్యక్షతన మున్సిపల్ కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ ధర్నా, ర్యాలీ నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. పట్టణంలో ఉన్న పేద కార్మికులకు రెండు సెంట్లు, గ్రామాల్లో ఉన్న కార్మికులకు మూడు సెంట్లు ఇవ్వాలని గృహ నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోదండయ్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. ర్యాలీ అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బాషా, విజయ్ కుమార్ ఏఐటీయూసీ నాయకులు రాజేంద్ర, ఉషారాణి, నగోమి, ఆటో నాయకులు ప్రకాష్, ఏసు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సెల్వి, రాజేష్ సుబ్రహ్మణ్యం, నాగరాజు, దీప, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఘనంగా రంగోత్సవ్ పోటీలు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ శేఖర్, అధ్యాపకుల బృందం

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం 2024–25 ఉమ్మడి జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డైట్ కళాశాల ఆవరణలో రెండు జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులకు ఎనిమిది అంశాల్లో పోటీ నిర్వహించగా అందులో దాదాపు 70 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్నారని పేర్కొన్నారు. రోల్‌ప్లేలో పచ్చికాపల్లం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం. ఐశ్వర్య, రంగోలి పోటీలో జీ.ఎం యూపీఎస్ డైట్ కార్వేటినగరానికి చెందిన కే.హిమశ్రీ బృందం, డిజిటల్ పోస్టర్ పోటీలో జెడ్పీహెచ్ఎస్ కార్వేటినగరం బాలికల పాఠశాలకు చెందిన కేఎం ధనశ్రీ విజేతలుగా నిలిచారన్నారు. అలాగే ఫోక్ డ్యాన్స్ పోటీలో జెడ్పీహెచ్ఎస్ కమ్మపల్లి గ్రామానికి చెందిన ఎం.ఉమాదేవీ అండ్ టీం, డ్రాయింగ్ పోటీలో కొత్తపల్లిమిట్ట జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఎం.సౌమ్యప్రీతి విజయం సాధించారన్నారు. స్లోగన్ పోటీలో వరదయ్యపాళెం మండలంలోని సంత వేలూరు ఉన్నత పాఠశాలకు చెందిన పీ.జయశ్రీ, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో చిత్తూరు జీహెచ్ఎస్‌కు చెందిన జీ.హాసని, క్విజ్ పోటీల్లో సంత వేలూరు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఝాన్సీ, నిచిత ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ తెలిపారు. అనంతరం రంగోత్సవ్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించి, అభినందించామన్నారు. అలాగే విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్, న్యాయనిర్ణేతలు

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

నగరి: సంక్రాంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. దీంతో కళాశాల ఆవరణ అంతా రంగవల్లులతో సరికొత్త శోభను సంతరించుకుంది. కళాశాల మహిళా సాధికారత సంఘం, తెలుగు, తమిళ విభాగాలు సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించాయి. 16 బృందాలుగా ఏర్పడి విద్యార్థినులు ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్ది సంక్రాంతి విశిష్టతను చాటిచెప్పారు. కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎ.ఇందిరా ప్రియదర్శిని, అధ్యాపకులు డాక్టర్ చినపాపమ్మ, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ పంకజ, డాక్టర్ మహేశ్వరి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ఉత్తమ రంగవల్లులను ఎంపిక చేసి, విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్, అధ్యాపకులు రేవతి, ప్రేమ్‌కుమార్, శివప్రసాద్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.